క్లుప్తంగా

స్వామిదాసును గెలిపించండి

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి విజ్ఞప్తి



తిరువూరు: స్థానికుడు, సౌమ్యుడైన నల్లగట్ల స్వామిదాసును తిరువూరు ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని కృష్ణా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి అన్నారు. తిరువూరు పట్టణంలోని 7వ వార్డులో శనివారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి స్వామిదాసుకు మద్దతుగా ఆయన సతీమణి సుధారాణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత 30 ఏళ్లుగా తిరువూరులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, స్వామిదాసుకు ఎమ్మెల్యేగా సేవలందించడానికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, మూడు దుర్గారావు, పరసా సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

ఆగిరిపల్లి: మండలంలో శనివారం నెక్కలం గొల్లగూడెం, అడవినెక్కలం గ్రామాల్లో 22 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. వలంటీర్లు మాట్లాడుతూ నిష్పక్షపాతంగా పేదల కోసం పనిచేస్తోన్న తమను టీడీపీ నాయకులు బెదిరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాజీనామా చేస్తున్నామని చెప్పారు.

ఘనంగా ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం ఇందిరమ్మ కాలనీలోని ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ సీహెచ్ పుష్పలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే నైతిక విలువలు, సామాజిక సేవ, విద్య వలన కలిగే ప్రయోజనాలు తెలియజేయాలన్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాసీం, సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా, మండల కార్యదర్శులు రెడ్‌స్టార్, ఆర్మ్‌స్ట్రాంగ్, హెచ్‌ఎం అమర్‌నాయక్, సీఆర్పీ డి.నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

ఆగిరిపల్లి: బాలలపై లైంగిక వేధింపులు, సైబర్ నేరాలపై బాలల ఆశ్రమ సిబ్బందితో పాటు పౌరులందరూ అవగాహన కలిగి ఉండాలని విజయవాడ వాసవ్య మహిళా మండలి ఉపాధ్యక్షురాలు కె.విజయ అన్నారు. మండలంలో శనివారం తోటపల్లి హీల్ సంస్థలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలను అసందర్భంగా తాకడం, సైగలు చేయడం, అశ్లీల పదాలను ప్రయోగించడం, శారీరక హింసకు గురిచేయడం, బాల్య వివాహాలు వంటి నేరాలకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. సైబర్ సంబంధిత నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, ప్రిన్సిపాల్ సాయిబాబు పాల్గొన్నారు.

23 నుంచి మారెమ్మ తిరునాళ్ల

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి వార్షిక తిరునాళ్ల ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ ఈఓ వై. సీతారామయ్య శనివారం తెలిపారు. 23న ఉదయం 6 గంటలకు అమ్మవారికి అంకురార్పణ, అమ్మవారికి మైలతీర్చడంతో తిరునాళ్ల మొదలవుతుందన్నారు. 24 సాయంత్రం 5 గంటల నుంచి గ్రామోత్సవం జరుగుతుందని చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి



విస్సన్నపేట: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి. నానిక అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక మహిళలకు గ్యాస్ సిలిండర్ వినియోగించే విధానం, అనుకోకుండా ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై శనివారం డెమో నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సత్యమ్మ తల్లి జాతర ప్రారంభం

నందిగామ: అంబారుపేట గ్రామంలోని సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా చైత్ర మాసంలో ఐదు రోజుల పాటు జరిపే జాతర కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే మంగళ వాయిద్యాలతో సుప్రభాత సేవ, మహా గణపతి పూజ, దీక్ష ధారణ, అఖండ దీప స్నపన కార్యక్రమాలు జరిగాయి.

మైలవరం గడ్డపై చరిత్ర తిరగరాస్తాం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు
- కోలాహలంగా నామినేషన్ దాఖలు
- మైలవరం, తిరువూరుల్లో నామినేషన్లు వేసిన పలువురు అభ్యర్థులు



మైలవరం పంచాయతీ నాలుగు రోడ్ల కూడలికి చేరుకున్న వైఎస్సార్ సీపీ ర్యాలీ

జి.కొండూరు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం మైలవరం, తిరువూరు నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా సర్నాల తిరుపతిరావు ఇబ్రహీంపట్నం మండల పరిధి దాములూరు నుంచి రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, కర్రా హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్‌కు తన నామినేషన్ పత్రాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తన గెలుపుతో ఆరున్నర దశాబ్దాల మైలవరం నియోజకవర్గ రాజకీయ చరిత్రను తిరగరాస్తామని చెప్పారు. తాను ఎటువంటి ఆర్గనైజింగ్ చేయకపోయినప్పటికీ స్వచ్ఛందంగా వేలాది మంది పార్టీ శ్రేణులు నామినేషన్ కార్యక్రమానికి హాజరై తనకు అండగా నిలిచారన్నారు. అణగారిన వర్గాలను చట్ట సభలకు తీసుకు వెళ్లాలనే జగనన్న సంకల్పానికి మైలవరం నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారని చెప్పారు. పూటకోమాట, రోజుకో పార్టీ మారే నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జగనన్న అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధే నేడు తన వెనుక బలం అని చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, కర్రా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సామాన్యుడు సర్నాల తిరుపతిరావుకి నియోజకవర్గ ప్రజలు అండగా ఉన్నారని నేటి నామినేషన్ కార్యక్రమంతో తేలిపోయిందన్నారు. ఐదు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమానం

వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు వేలాదిగా తరలి వచ్చారు. ఇబ్రహీంపట్నం మండలం దాములూరు నుంచి ప్రారంభమైన ర్యాలీ కొండపల్లి, జి.కొండూరు, చెవుటూరు, వెంకటాపురం గ్రామాల మీదుగా వేలాదిమంది కార్యకర్తలు, నాయకులతో మైలవరం చేరుకుంది. 20 వేలకు పైగా కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చారు. భారీ ర్యాలీగా మైలవరం చేరుకున్న సర్నాల తిరుపతిరావుకి మైలవరం మండల పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. మైలవరం పట్టణంలోని గ్రామ పంచాయతీ సెంటర్‌లో ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుని, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని, ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)ని, నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, కర్రా హర్షవర్ధన్‌రెడ్డిలను పార్టీ నాయకులు క్రేన్ సాయంతో భారీ గజమాలతో సత్కరించారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న పాటలకు వయస్సుతో సంబంధం లేకుండా పురుషులు మహిళలు, యువకులు చేసిన నృత్యాలు అలరించాయి. యువకులు బైకులతో విన్యాసాలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తీన్మార్ డప్పు వాయిద్యాలు, కోలాటం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేలాదిగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులతో మైలవరం పట్టణం జనసంద్రమైంది.

రాయనపాడు నుంచి తరలిన నాయకులు..

రాయనపాడు(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు నామినేషన్ కార్యక్రమానికి రాయనపాడు గ్రామం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పి. వాసు ఆధ్వర్యంలో నాయకులు పోలసాని సురేష్(బుజ్జి), మల్లాది వెంకటేశ్వరరావు, తలారి సాంబశివరావు తదితరులు తరలివెళ్లారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ సంపత్ కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సర్నాల తిరుపతిరావు



తిరువూరు స్వతంత్ర అభ్యర్థిగా ఆర్డీఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రసన్నకుమార్



ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డప్పు వాయిద్య కళాకారులు

కోలాహలంగా వైఎస్సార్ సీపీ ర్యాలీ..

ఇబ్రహీంపట్నం: మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు నామినేషన్ నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలో శనివారం కోలాహలం నెలకొంది. నామినేషన్ పర్వానికి వివిధ గ్రామాల నుంచి నాయకులు కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా ఇబ్రహీంపట్నం తరలివచ్చారు. రింగ్ సెంటర్‌కు చేరుకున్న ఎంపీ కేశినేని నాని, అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, నియోజకవర్గ పరిశీలకులు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి, అప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రజలను ఆప్యాయంగా పలుకరించి పరిచయం చేసుకున్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తండ్రి, మాజీ ఎంపీపీ జోగి మోహనరావు ఆశీస్సులు తీసుకున్న అనంతరం కార్లు, ఆటోలు, బైక్‌లతో ర్యాలీగా మైలవరం బయలుదేరి వెళ్లారు. దారిపొడవునా ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఓట్లు అభ్యర్థించారు. పార్టీ నాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, గుంజా శ్రీనివాస్, మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం నుంచి ర్యాలీగా వెళుతున్న నాయకులు, ప్రజలు

ఆరు నామినేషన్లు దాఖలు

మైలవరం/తిరువూరు: మైలవరం, తిరువూరు నియోజకవర్గాలకు సంబంధించి శనివారం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్ తెలిపారు. మైలవరం నియోజకవర్గానికి సంబంధించి ముగ్గురు ఎమ్మెల్యే అభ్యర్థులుగా మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సర్నాల తిరుపతిరావు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బత్తినపాడు గ్రామానికి చెందిన గుడిశ రాంబాబు, కంచికచర్ల గ్రామానికి చెందిన చింతమాల నవీన్ అంబేడ్కర్ నామినేషన్లు దాఖలు చేశారు.

తిరువూరు నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థులుగా లక్కెపోగు వందనకుమార్, గంగవరపు శామ్యూల్ దేవసహాయం, స్వతంత్ర అభ్యర్థిగా లాము ప్రసన్నకుమార్ నామినేషన్ పత్రాలను తిరువూరు ఆర్డీఓ కె. మాధవికి సమర్పించారని చెప్పారు.

పేదల ఆర్థికాభ్యున్నతికి జగనన్న కృషి

తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు

గంపలగూడెం: పేదవర్గాల ఆర్థికాభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో విశేషంగా కృషి చేశారని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. శనివారం గంపలగూడెం మండలం కనుమూరు, అనుముల్లంక, కొత్తపల్లి, వినగడప గ్రామాల్లో స్వామిదాసు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో స్వామిదాసుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు ప్రచారంలో హుషారుగా పాల్గొన్నారు. స్వామిదాసు ఎన్నికల ప్రచార రథంపై నుంచి అభివాదం చేస్తూ మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లోని కూడళ్లలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు మంచి జరిగితేనే ఈ విడత ఓటు వేయండంటూ ఎన్నికల ప్రచారంలో ధైర్యంగా మాట్లాడుతున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అని అన్నారు. కరోనాలాంటి కష్టకాలంలో కూడా ఆర్థిక పరిస్థితిని సమతుల్యం చేస్తూ పేదలకు సంక్షేమ పథకాలను ఆపకుండా ముఖ్యమంత్రి కొనసాగించిన విషయం ప్రజలు గుర్తించాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో దళారులు, రాజకీయాల ప్రమేయం లేకుండా అమలు పర్చారని వివరించారు. సంక్షేమ పథకాలు యథావిధిగా అమలు జరగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీకి ఓటువేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. తిరువూరు ఎమ్మెల్యేగా తనను, విజయవాడ ఎంపీగా కేశినేని నానిని గెలిపించాలని కోరారు. నాయకులు చెరుకు నర్సారెడ్డి, వజ్రాల శ్రీనివాసరెడ్డి, సీహెచ్ భాస్కర్‌రెడ్డి, గొరసాని శ్రీనివాసరెడ్డి, అత్తునూరి పద్మారెడ్డి, గొరసాని రంగారెడ్డి, ధనికొండ నర్సిరెడ్డి, మేచినేని నాగమల్లేశ్వరరావు, పెమ్మిరాజు ఆంజనేయులు, మీసాల కోటి, వంగల వైకుంఠం, నరెడ్ల ఓగిరెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనుముల్లంకలో ప్రజలకు అభివాదం చేస్తున్న స్వామిదాసు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

రెడ్డిగూడెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి మద్దులపర్వ గ్రామంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన 30 కుటుంబాల వారు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి, పాలంకి సురేష్‌రెడ్డిలు వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ సామాన్యుడు సర్నాల తిరుపతిరావు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) గెలుపునకు, మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాలంకి రమణారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చాట్ల రామారావు (ఏసు), మాజీ సర్పంచ్ కోమటి కృష్ణ, మాజీ ఎంపీటీసీ కొలుసు గంగాధర్, మాజీ వైస్ సర్పంచ్ బొమ్మిన సత్యనారాయణ, తొర్లికొండ వెంకటరమణ, కేదాసు శివయ్య, దాసరి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, సురేష్‌రెడ్డి

కాచవరంలో పోలీసుల కవాతు

కాచవరం(ఇబ్రహీంపట్నం): ప్రజలు ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలీసులు రక్షణ కల్పిస్తారని సీఐ ఎం.సత్యనారాయణ అన్నారు. కాచవరంలో ఓటు హక్కు వినియోగంపై పోలీసులు నిర్వహించిన కవాతులో శనివారం ఆయన పాల్గొన్నారు. వీధుల్లో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్ఐ పాపారావు, 100 మంది సివిల్, పారామిలటరీ పోలీసులు పాల్గొన్నారు.

నేడు మధుమేహ రోగులకు వైద్య శిబిరం

తిరువూరు: జనవిజ్ఞాన వేదిక, జీబీఆర్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరులో మధుమేహ రోగులకు వైద్యశిబిరం నిర్వహిస్తామని జేవీవీ పట్టణ అధ్యక్షుడు పాపారావు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లోని నాగార్జున స్కూల్ ఆవరణలో శిబిరం ప్రారంభమవుతుందన్నారు. రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడా మందులు అందజేస్తామని చెప్పారు.

బోనస్ పంపిణీ

రెడ్డిగూడెం: కృష్ణా మిల్క్ యూనియన్‌లో పాలు పోసి యూనియన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి అన్నారు. కొత్తరెడ్డిగూడెం పాల కేంద్రంలో పాలు పోసిన రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ మూడో విడత రూ. 3,30,033ల బోనస్‌ను శనివారం పంపిణీ చేశారు. కొత్తరెడ్డిగూడెం పాల సంఘం డైరెక్టర్లు ఎ. జమలారెడ్డి, డి. శ్రీనివాసరెడ్డి, టి. బాబురెడ్డి, జి. నరసింహారెడ్డి, జి. వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కె. శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. కొండపల్లిలోని తమ పాఠశాలలో ప్రవేశ పరీక్ష రాసేందుకు 6, 7, 8 తరగతుల విద్యార్థులు 13 మందిని కేటాయించారన్నారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు కాగా 11 మంది పరీక్ష రాశారని చెప్పారు.

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ ప్రచారం

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం సాయంత్రం కృష్ణవరం, సురవరం, కొమ్మూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

ముసునూరు: ఉపాధి హామీ కూలీలు మస్టర్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా సంతకాలు చేయాలని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. బలివే, వేల్పుచర్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫీడర్ చానల్స్, సప్లయ్ కెనాల్స్ తవ్వకం పనులను శనివారం ఆమె పరిశీలించారు. మస్టర్ రిజిస్టర్‌లో కూలీలతో సంతకాలు చేయించాలని ఉపాధి హామీ సిబ్బందికి ఎంపీడీఓ సూచించారు. పని ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో ఏపీఓ రోజ్‌లీల, జయప్రసాద్, ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

26న షర్మిల తిరువూరు పర్యటన

తిరువూరు: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 26న తిరువూరు రానున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లాం తాంతియాకుమారి తెలిపారు. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల ముఖ్య నాయకుల సంయుక్త సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా షర్మిల తిరువూరు వస్తున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

ఓపెన్ డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లించండి

నూజివీడు: బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని స్థానిక డీఏఆర్ కళాశాల లెర్నర్ సపోర్ట్ సెంటర్‌లో చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజు మే 6వ తేదీలోగా చెల్లించాలని కళాశాల ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు మే 26 నుంచి ప్రారంభమవుతాయని, హాల్ టిక్కెట్లను యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు సెల్: 73829 29686 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా విద్యార్థుల ఫేర్‌వెల్

ఆగిరిపల్లి: అమ్మవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని అంజనాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ముసునూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరుగుతుందని ఎంపీడీఓ పద్మావతీదేవి తెలిపారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సారా విక్రేతకు రూ.30 వేల జరిమానా

తిరువూరు: ఎ.కొండూరు మండలం కేశ్యా తండాలో సారా విక్రయిస్తూ పట్టుబడిన భరోతు హరిబాబుకు ఆ మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ రూ.30 వేలు జరిమానా విధించారు. శనివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు నిర్వహించిన దాడుల్లో నిందితుడు 10 లీటర్ల సారాతో పట్టుబడ్డాడు. ఎ.కొండూరు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ విచారించి అతనికి జరిమానా విధించారని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. ఎ. కొండూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నాటకారని రవితేజ నుంచి 12 తెలంగాణ మద్యం సీసాలు, వడిత్యా కోటేశ్వరరావు నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం

నూజివీడు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని ఆ పార్టీ నాయకుడు, ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) అన్నారు. నూజివీడు రెండో వార్డులో శనివారం రాత్రి చంటినాయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చంటినాయన మాట్లాడుతూ రాష్ట్రానికి టీడీపీ, జనసేన, బీజేపీలతో ఒరిగిందేమీ లేదని, అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు ఆ మూడు పార్టీలు కలిసే ఉన్నాయని, వారి పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిన విధానాన్ని వివరించారు. నూజివీడు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావును, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దాసరి మారు అప్పాజీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, నాయకులు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నూజివీడు రెండో వార్డులో ప్రచారం చేస్తున్న మేకా వేణుగోపాల అప్పారావు